క్లుప్తంగా

'తుర్క కాశ' సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న కాశ సంఘం నాయకులు

తిప్పర్తి : తుర్క కాశ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతు కాశ సంఘం నాయకులు హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఆదివారం పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ కాశ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే బడేసాబ్, జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే అబ్దుల్ రహీం మాట్లాడుతూ బ్యాంకులతో సంబంధం లేకుండా రుణాలు ఇవ్వాలని, అత్యాధునిక యంత్రాలను మంజూరు చేయాలని, రాయి కొట్టే కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

జ్ఞాన సమాజ నిర్మాణమే స్వేరోస్ ధ్యేయం



సమావేశంలో పాల్గొన్న స్వేరోస్ నాయకులు

నల్లగొండ: జ్ఞాన సమాజ నిర్మాణమే ధ్యేయంగా స్వేరోస్ పనిచేయాలని స్వేరోస్ రాష్ట్ర చీఫ్ కన్వీనర్ బల్గూరి దుర్గయ్య అన్నారు. ఆదివారం నల్లగొండలో నిర్వహించిన స్వేరోస్ సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో స్వేరోస్ రాష్ట్ర కో కన్వీనర్ అనుముల సురేష్, జిల్లా అధ్యక్షుడు బొజ్జ పాండు, రాజు, కుక్కముడి శ్రీనివాస్, యాదమ్మ, చరణ్, వినోద్ పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లు నిర్మించాలంటూ సైకిల్ యాత్ర



సైకిల్ యాత్ర చేస్తున్న జానయ్య

నల్లగొండ టూటౌన్: గ్రామీణ రోడ్ల నిర్మాణం, అభివృద్ధి కోసం నల్లగొండ మండలం పెద్ద సూరారం గ్రామానికి చెందిన తెలంగాణ గ్రామీణ రహదారుల నిర్మాణ అభివృద్ధి సాధన సమితి కన్వీనర్ భీమనబోయిన జానయ్య సైకిల్ యాత్ర చేపట్టారు. ఆదివారం నల్లగొండ పట్టణం నుంచి సైకిల్ యాత్ర ప్రారంభించారు. సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయానికి వెళ్లి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతి పత్రం ఇవ్వనున్నట్లు జానయ్య తెలిపారు. గ్రామాలను అనుసంధానం రోడ్ల నిర్మాణం చేపట్టాలని, ప్రతి గ్రామం నుంచి సమీపంలోని మార్కెట్‌కు రైతులు తమ పంటలను తీసుకెళ్లేందుకు రోడ్లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసేందుకు సైకిల్ యాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు.

చిట్యాల : గ్రామీణ రహదారులు అభివృద్ధి చేయాలంటూ పెద్ద సూరారం గ్రామానికి చెందిన భీమనబోయిన జానయ్య చేపట్టిన సైకిల్ యాత్ర చిట్యాల మండలం పెదకాపర్తి గ్రామానికి చేరుకుంది. యాత్రకు ఫ్రెండ్స్‌యూత్ అధ్యక్షుడు గుండెబోయిన నర్సింహ, సాగర్ల మల్లయ్య స్వాగతం పలికారు.

రేషన్ కార్డుల పేరిట డబ్బులు వసూలు చేస్తే చర్యలు

గట్టుప్పల్ : రేషన్ కార్డులు ఇప్పిస్తామని కొంత మంది డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గట్టుప్పల్ తహసీల్దారు రాములు హెచ్చరించారు. అర్హులైన పేదలు రేషన్ కార్డు కోసం మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసి ఆ ఫాంను తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలన్నారు. విచారణ చేసిన అనంతరం నివేదికను జిల్లా అధికారులకు పంపిస్తామన్నారు. ఎవరైనా రేషన్ కార్డులకు డబ్బులు అడిగినా.. మభ్య పెట్టినా తనకు నేరుగా సమాచారం ఇవ్వాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందుతాయని, దళారులను ఆశ్రయించకుండా నిబంధనల మేరకు మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సర్వీస్ రోడ్డు పనులు ప్రారంభించాలి

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలో సర్వీస్‌రోడ్డు పనులు ప్రారంభించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణ కేంద్రంలో నిలిచిపోయిన సర్వీస్‌రోడ్డు పనులను పరిశీలించి మాట్లాడారు. బీజేపీ మున్సిపల్ కమిటీ అధ్యక్షురాలు కడారి కల్పనయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కైరంకొండ అశోక్, నాయకులు పోలోజు శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలన దరఖాస్తులకు మోక్షమేది !

- గ్రామ సభలో రేషన్ కార్డుల కోసం వినతులు ఇచ్చిన ప్రజలు
- మంజూరు కాని కార్డులు
- మీ సేవలో దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరు



గట్టుప్పల్ మండల కేంద్రంలో ప్రజాపాలన గ్రామ సభ (ఫైల్)

గట్టుప్పల్ : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా ఆరు నెలల క్రితం నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో అధికారులు రేషన్ కార్డులకు దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం అధికారులు టీంలుగా ఏర్పడి దరఖాస్తులను విచారించి అర్హులను ఎంపిక చేశారు. అర్హుల జాబితాను సైతం గ్రామ సభల్లో చదవి వినిపించారు. ఇదంతా వేగంగానే జరిగింది. కానీ ప్రజా పాలనలో దరఖాస్తుదారులకు కొంత మంది మినహా అందరికీ రేషన్ కార్డులు రాలేదు. ఈ క్రమంలో ప్రభుత్వం రేషన్ కార్డు కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నవారు మీ సేవ కేంద్రంలో కూడా దరఖాస్తులు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో అవగాహన కలిగిన కొంత మంది మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకున్నారు. వారికి త్వరగానే కార్డులు అందాయి. అయితే అనేక మంది మీ సేవ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలనే అవగాహన లేక దరఖాస్తులు చేసుకోవడం లేదు.

గట్టుప్పల్ మండల వ్యాప్తంగా..

గట్టుప్పల్ మండల పరిధిలోని ఆరు గ్రామాలకుగాను 1353 మంది కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు చేసుకున్నారు. రేషన్‌కార్డులో పేర్లు యాడ్ చేసేందుకు 314 మంది దరఖాస్తులు చేసుకున్నారు. కొత్త రేషన్‌కార్డులకు గట్టుప్పల్‌లో 473 మంది, అంతంపేటలో 149, సోమరాజుగూడలో 181, నామపురం 140, వెల్మకన్నె 147, ఖమ్మగూడెం 15, తేరట్‌పల్లి 207, శేరిగూడెం 41 మంది దరఖాస్తులు చేసుకున్నారు.

కొత్త కార్డుకు అఫిడవిట్ లింకు..

ప్రజా పాలనలో దరఖాస్తులు చేసుకున్నవారికి రేషన్ కార్డులు అందకపోవడంతో తిరిగి మీ సేవ ద్వారా దరఖాస్తులు చేసుకుంటున్నారు. కానీ రెవెన్యూ అధికారులు మాత్రం కొత్త కార్డు పొందేందుకు తప్పనిసరి అఫిడవిట్ పెట్టాల్సిందేనని లింకు పెట్టడంతో దరఖాస్తుదారులు అఫిడవిట్ కోసం నానా తంటాలు పడుతున్నారు. అనర్హులు సైతం రేషన్ కార్డులకు దరఖాస్తులు చేసుకుంటున్నారు. అఫిడవిట్ ఉంటే తప్పుడు సమాచారం ఇస్తే దరఖాస్తుదారుడే బాధ్యుడవుతాడని తాము సేఫ్‌గా ఉంటామని అధికారులు భావిస్తున్నారు.

మీ సేవలో ఇలా దరఖాస్తులు ..

అర్హులైన కుటుంబాలు స్థానికంగా ఉన్న మీసేవ కేంద్రానికి వెళ్లి కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, ఓటర్ కార్డులతో నూతన రేషన్ కార్డుకు దరఖాస్తు చేసి నేరుగా తహసీల్దారు కార్యాలయంలో దరఖాస్తు ఫాం అందజేయాల్సి ఉంటుంది. అనంతరం ఆర్ఐ దరఖాస్తుదారుడి ఇంటికి వచ్చి విచారణ చేసి డీఎస్ఓ కార్యాలయానికి విచారణ కాపీని అప్‌లోడ్ చేస్తారు. ఆ తర్వాత కొత్త కార్డు లబ్ధిదారుడికి మంజూరు అవుతుంది. కుటుంబ సభ్యుడు మాత్రమే దరఖాస్తును కార్యాలయంలో ఇవ్వాలని దళారులను నమ్మకూడదని తహసీల్దారు చెబున్నారు.

ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న



ప్రజా పాలనలో ఆరు గ్యారంటీల్లో భాగంగా రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకున్న. జాబితాలో పేరు వచ్చింది కానీ రేషన్ కార్డు రాలేదు. మీ సేవలో దరఖాస్తు చేసుకోవాలని నాకు తెలియదు. మరోసారి మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకుంటా. అఫిడవిట్ లేకుండా విచారణ చేసి రేషన్ కార్డు ఇస్తే బాగుండు.

– నరేందర్, గట్టుప్పల్

దళారులను నమ్మకండి



అర్హులైన వారు నేరుగా ఆధార్ కార్డులు, ఓటర్ కార్డు తీసుకెళ్లి మీసేవ కేంద్రంలో కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు చేసుకోండి. ఆ తర్వాత దరఖాస్తు ఫాం, అఫిడవిట్ జతచేసి మా కార్యాలయంలో ఇవ్వండి. తర్వాత ఆర్ఐతో విచారణ చేయించి డీఎస్ఓ కార్యాలయానికి అప్‌లోడ్ చేస్తాం. కార్డులు మంజూరు చేయిస్తామని అక్కడక్కడ దళారులు మోసం చేస్తున్నట్లు తెలిసింది. అలాంటి వారిని నమ్మకండి. ఎవరైన రేషన్ కార్డులు ఇప్పిస్తాం అని డబ్బులు వసూలు చేస్తే మాకు సమాచారం ఇవ్వండి.

– రాములు, తహసీల్దారు

ఉపాధి నిధుల్లో కోత విధించడం తగదు



మాట్లాడుతున్న నారి ఐలయ్య

నల్లగొండ టౌన్ : నరేంద్ర మోదీ ప్రభుత్వం ఉపాధి హామీ నిధుల్లో కోత విధించడం తగదని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య అన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని సుందరయ్య భవన్‌లో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ పాలనలో వ్యవసాయ కార్మికులకు, పేదలకు, కౌలు రైతులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మోదీ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జూలై 9న నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల జిల్లా కన్వీనర్ దండంపల్లి సరోజ మాట్లాడుతూ రాష్ట్రంలో మిగిలి ఉన్న కోటి 50 లక్షల ఎకరాల మిగులు భూమిని భూమి లేని ప్రతి కుటుంబానికి 2 ఎకరాల చొప్పున పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో తెలకలపల్లి శ్రీను, సిరిశాల గిరికుమార్, అశ్వని, దండంపల్లి యాదయ్య, కృష్ణ, సర్దార్ అలీ, మారయ్య, చెరుపల్లి శివమ్మ, అశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాచకొండ ప్రభాకర్

నల్లగొండ టూటౌన్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ అన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాల మైదానంలో ఆయన డ్రగ్స్ నివారణపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పోస్టర్ ఆవిష్కరించారు. జిల్లా వ్యాప్తంగా తాము స్వచ్ఛందంగా డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వినూత్న వేషధారణలో చేపట్టిన ఈ కార్యక్రమం ఎన్జీ కళాశాల వాకర్స్‌ను అలరించింది. కార్యక్రమంలో జేఏసీ నాయకులు తోట నరసింహాచారి, లింగయ్య, నాగార్జున, నరసింహ, లక్ష్మయ్య, మధు పాల్గొన్నారు.

వృథాగా కృష్ణా జలాలు



పగిలిన పైప్‌లైన్

గట్టుప్పల్ : మండల కేంద్రంలోని మార్కండేశ్వర స్వామి ఆలయం ప్రహరీ దగ్గర గట్టుప్పల్‌కు సరఫరా అయ్యే కృష్ణా జలాల పైప్ లైన్ మూడు రోజుల క్రితం పగిలి నీళ్లు వృథాగా పోతున్నాయి. దీంతో మండల కేంద్రంలోని ఓ ప్రాంతానికి నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. పైప్‌లైన్ పగిలినా సంబంధిత సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆ ప్రాంతం ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్ మరమ్మతులు వెంటనే చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నార్కట్‌పల్లి : పట్టణంలోని మెయిన్ సెంటర్ నుంచి వివేరా హోటల్ వరకు రోడ్డు ఇరువైపుల లూజ్ పోల్స్ మరమ్మతులు చేయడానికి సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీరు చంద్రశేఖర్‌రావు ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని ప్రజలు సహకరించాలని కోరారు.

పొంచి ఉన్న ప్రమాదం

కేతేపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనం సమీపంలో ఏర్పాటు చేసిన రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉండడంతోపాటు వాటికి ఎలాంటి రక్షణ గోడలు నిర్మించలేదు. సర్వీసు రోడ్డు వెంట నిత్యం రద్దీగా ఉండే ప్రదేశంలో ట్రాన్స్‌ఫార్మర్ల ఫీజులు చేతికందే ఎత్తులో ఉండడంతో దారిన పోయే పశువులు, చిన్న పిల్లలకు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఎరువులు, విత్తనాల కోసం నిత్యం కార్యాలయం వద్దకు వచ్చే రైతులతో ఈ ప్రాంత సందడిగా ఉంటుంది. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచె వేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కేతేపల్లి సింగిల్‌విండో కార్యాలయం సమీపంలో రక్షణ లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు

అఖిల భారత మహాసభలకు ఎంపిక

నల్లగొండ టౌన్ : కేరళ రాష్ట్రంలోని కొచ్చికోడ్‌లో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు జరుగనున్న ఎస్ఎఫ్ఐ అఖిల భారత 18వ మహాసభలకు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ ఎంపికయ్యారు. నల్లగొండ జిల్లా నుంచి మహాసభలకు ఐదుగురు ఎంపికయ్యారని శంకర్ తెలిపారు.

శివయ్య సేవలో ప్రభుత్వ విప్ అయిలయ్య



పూజలో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

నార్కట్‌పల్లి : మండలంలోని చెర్వుగట్టు గ్రామంలో గల శ్రీపార్వతి జడల రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ప్రభుత్వ విప్ స్వామివారి సన్నిధిలో రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించగా అర్చకులు రామలింగేశ్వర శర్మ, సురేష్‌శర్మ, శ్రీకాంత్ శర్మలు స్వామివారి ఆశీర్వచనం అందజేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకుడు వడ్డే భూపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

'రజాకార్ సినిమాకు అవార్డు రద్దు చేయాలి'

నల్లగొండ టౌన్ : రజాకర్ సినిమాకు గద్దర్ పేరిట ప్రభుత్వం అవార్డు ఇవ్వడం గద్దర్ నమ్మిన సిద్ధాంతానికి వ్యతిరేకమని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అవార్డును రద్దు చేయాలని కోరారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తూ నిర్మించిన రజాకారు సినిమాకు అవార్డు ఇవ్వాలని తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామ్య విరుద్ధమని అన్నారు. గద్దర్ ఉన్నత విలువల కోసం, కులమతాలు లేని సమాజం కోసం పరితపించేవారని అన్నారు.

ఒలింపిక్ రన్



ఒలింపిక్ రన్ ప్రారంభిస్తున్న ఒలింపిక్ అసోసియేషన్ చైర్మన్ హఫీజ్‌ఖాన్

నల్లగొండ టూటౌన్: జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కాలేజీ నుంచి ఇండోర్ స్టేడియం వరకు ఒలింపిక్ రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అసోసియేషన్ చైర్మన్ హఫీజ్‌ఖాన్ ప్రారంభించారు. అనంతరం జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి అక్బర్ అలీ మాట్లాడుతూ జిల్లాకు చెందిన క్రీడాకారులు క్రీడల్లో జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలోనే ఉంచాలని కోరారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి కర్తయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఇమామ్ కరీం, బొమ్మపాల గిరిబాబు, కవిత, విమల, బండారు ప్రసాద్, లింగయ్య, యూనస్, ఏకస్వామి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటికి ఘన స్వాగతం



స్వాగత ర్యాలీలో పాల్గొన్న చెక్క భజన కళాకారులు



ర్యాలీలో అభివాదం చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు వీరేశం, లక్ష్మారెడ్డి

నకిరేకల్ : ఇందిరమ్మ ఇళ్ల ధ్రువపత్రాలు పంపిణీ చేసేందుకు నకిరేకల్‌కు వచ్చిన రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఆదివారం స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. స్థానిక మెయిన్ సెంటర్‌లో కోలాట ప్రదర్శనలతో స్వాగతం పలికారు. మెయిన్ సెంటర్లోని ఇందిరాగాంధీ విగ్రహానికి మంత్రి పూలమాల వేశారు. ఓపెన్ టాప్ జీప్‌పై మంత్రితోపాటు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌లు వీరేశం ఆధ్వర్యంలో ప్రజలకు అభివాదం చేస్తూ భారీ ప్రదర్శనగా స్థానిక మినీ స్టేడియంకు చేరుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతోపాటు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా తరలిరావడంతో నకిరేకల్ పట్టణ ప్రధాన వీధులు కిక్కిరిశాయి. నకిరేకల్ నియోజకవర్గ వ్యాప్తంగా 3500 మందికి ఇందిరమ్మ ఇళ్ల ధ్రువపత్రాల పంపిణీ చేశారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజాప్రతినిధుల రాక సందర్భంగా సారథి కళాకారులు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై పాటల రూపేణా ఇచ్చిన కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా ఆరు మండలాల నుంచి హాజరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు, పార్టీ శ్రేణులకు తగిన ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. సభ అనంతరం ఎమ్మెల్యే వేముల వీరేశం ఇంట్లో మంత్రితోపాటు ఇతర ప్రజాప్రతినిధులు భోజనం చేసి వెళ్లారు.

నిరుపయోగంగా హ్యాండ్ వాష్ నల్లాలు



తిప్పర్తి ప్రాథమిక పాఠశాలలో నిరుపయోగంగా మారిన నల్లాలు

తిప్పర్తి: పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి మన ఊరు–మన బడి కార్యక్రమాన్ని గత ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కార్యక్రమంలో భాగంగా తిప్పర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో వాటర్ ట్యాంక్ పక్కన విద్యార్థులు చేతులు కడుక్కోవడానికి నల్లాలు ఏర్పాటు చేశారు. కానీ వాటికి ట్యాప్‌లు బిగించకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి.

వన మహోత్సవానికి మొక్కలు సిద్ధం



మండలాపురం నర్సరీలో పెరుగుతున్న మొక్కలు



తాటికల్ నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి (ఫైల్)

- నకిరేకల్ మండలంలో 17 గ్రామ పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు
- వర్షాలు కురవగానే నాటాలని ప్రణాళిక

నకిరేకల్ : అడవుల శాతం పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న వన మహోత్సవం కార్యక్రమానికి నకిరేకల్ మండలంలోని నర్సరీలో మొక్కలు నాటడానికి సిద్ధంగా ఉన్నాయి. వర్షాలు కురవగానే మొక్కలు నాటించడానికి అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. నకిరేకల్ మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో వివిధ రకాల మొక్కలను పెంచుతున్నారు. మండల వ్యాప్తంగా 42,000 మొక్కలను రోడ్ల వెంట, ఇళ్ల ముందు ఇళ్లలో పెంచేందుకు 55 వేల మొక్కలను నాటాలని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. లక్ష్యం కంటే అదనంగానే ఒక లక్షా 79 వేల మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నారు. ఆయా గ్రామాల్లో ఉన్న నర్సరీల్లో నీడ, పూలు, పండ్లనిచ్చే మొక్కలతోపాటు కలప ఈత, కర్జూర మొక్కలను కలుపుకుని మొత్తం ఏడు రకాల మొక్కలను పెంచుతున్నారు. ఆయా గ్రామాల్లో ఉన్న నర్సరీల నిర్వహణ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చేపట్టారు. అన్ని గ్రామాల్లో నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నప్పటికీ వర్షాలు పూర్తిస్థాయిలో కురవకపోవడంతో మొక్కలను నాటే కార్యక్రమాన్ని ఇంకా చేపట్టలేదు.

గతంలో నాటిన మొక్కలకు సంరక్షణ కరువు

వన సంరక్షణ కోసం ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో ఈసారైనా అనుకున్న లక్ష్యం మేరకు మొక్కలు నాటుతారా అనే సందేహం నెలకొంది. ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా పచ్చదనం పరిరక్షణకు వన మహోత్సవం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతి ఏటా లక్షల్లో టార్గెట్ పెట్టుకున్నప్పటికీ టార్గెట్‌లో సగం మేర మాత్రమే మొక్కలు నాటుతున్నారు. నాటిన మొక్కల్లో సగంమేర మాత్రమే మొక్కలు సంరక్షణకు నోచుకుంటున్నాయి. మిగతా మొక్కలు నీటి సౌకర్యం లేక ఎండిపోతున్నాయి. ఈసారైనా లక్ష్యం మేరకు మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను అధికారులు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఏడు రకాల మొక్కలను పెంచుతున్నాం



నకిరేకల్ మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో గ్రామ జనాభా ప్రతిపాదికన నర్సరీలను ఏర్పాటు చేసి ఏడు రకాల మొక్కలను పెంచుతున్నాం. ప్రధానంగా నీడ, పండ్లు, పూలనిచ్చే మొక్కలతోపాటు ఈత, ఖర్జూర, మొక్కలను పెంచుతున్నాం. వర్షాలు పూర్తి స్థాయిలో కురిస్తే వన మహోత్సవంలో భాగంగా అన్ని గ్రామాల్లో మొక్కలను నాటే ప్రక్రియ ప్రారంభిస్తాం.

– రమణయ్య, ఏపీఓ, నకిరేకల్